విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 30, డిసెంబరు 2025

ఏడాదిగా పింఛన్ అందక నరకం

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల పరిధిలోని చెన్నూరు గ్రామంలో ఎస్సీ కాలనీలో నివసిస్తున్న పాణ్యం మరియమ్మ (80) వృద్ధురాలు అధికారుల చుట్టూ తిరుగుతూ మానసిక వేదనకు గురవుతున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పింఛన్లు అందించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశిస్తుంటే స్థానిక అధికారులు సచివాలయ సిబ్బంది యొక్క నిర్లక్ష్యం కారణంగా పింఛన్ అందడం లేదని సోమవారం నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరియమ్మ భర్త ఆనందరావు మృతి చెంది ఏడాదిన్నర అవుతున్నదని నాటి నుండి ప్రభుత్వ పింఛన్ కోసం గ్రామ సచివాలయం, మండల ప్రజాపరిషత్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నట్లు తెలిపారు. రికార్డింగ్ డొక్కనిందని నిరుపేద కుటుంబానికి చెందిన పన్నెం మరియమ్మకు ప్రభుత్వ వితంతు పెన్షన్ అందించి ఆదుకోవాలని జిల్లా కలెక్టర్‌ని కోరారు.

30న ముక్కోటి ఏకాదశి ఉత్సవం

విశాలాంధ్ర - శ్రీశైలం : డిసెంబరు 30న ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక ఉత్సవం ఈ ఉత్సవం సందర్భంగా ఆరోజు వేకువజామున శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను ఉత్తరద్వార దర్శనం, రావణవాహనసేవ నిర్వహించబడుతాయి. ఉత్సవమూర్తులను స్వామివారి ఆలయ ముఖమండప ఉత్తరద్వారం నుండి వెలుపలకు తోడ్కొనివచ్చి ఆలయ ఉత్తరభాగంలో రావణవాహనంపై ఆశీనులను చేసి ప్రత్యేక పూజలు ముక్కోటి ఏకాదశి రోజు ఉదయం గం.3.00లకు ఆలయద్వారాలను తెరచి మంగళ వాయిద్యాల అనంతరం గం.3.30ని॥లకు స్వామివారికి సుప్రభాతసేవ నిర్వహించబడుతుంది. తరువాత శ్రీ స్వామిఅమ్మవార్లకు ప్రాత:కాలపూజలు జరిపించి గం.4.30 ని॥లకు స్వామివారికి, తరువాత అమ్మవారికి మహామంగళహారతులు జరిపించబడతాయి. ఉదయం 5.30నిలకు రావణవాహనసేవ జరిపించబడుతుంది. ఆ తరువాత శ్రీస్వామిఅమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించబడుతుంది. శ్రీ స్వామిఅమ్మవార్ల గ్రామోత్సవం తదుపరి ఉదయం గం.6.00ల తరువాత దర్శనాలు, ఆర్జితసేవలు ప్రారంభమవుతాయి.

దళితుల భూములను విడిపించండి

విశాలాంధ్ర - నంద్యాల రూరల్ : అక్రమ దారుల నుండి దళితుల భూములను విడిపించాలని దళిత సమాఖ్య ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తీక్‌కి సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కొమ్ముపాలెం శ్రీనివాసులు నంద్యాల జిల్లా అధ్యక్షులు ప్రేమ్ కుమార్‌లు మాట్లాడుతూ నంద్యాల మండలం రాయ మల్పురం,భీమవరం గ్రామాల్లో దళితుల భూములను అక్రమదారుల నుండి విడిపించి అనుభవంలో ఉన్న వారికి పట్టాదారు పాసుబుక్కులు ఇవ్వాలని కోరారు. ముఖ్యంగా దళితులు కొన్ని సంవత్సరాల నుండి వివిధ పంటలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. అందువల్ల అనుభవంలో ఉన్న వారికి పాసుబుక్కులు ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ తెలియజేశారు. జాయింట్ కలెక్టర్ తక్షణమే స్పందించి తహసీల్దారుకి సమస్యను పరిష్కారించమని ఆదేశించారు. వినతి పత్రం సమర్పించిన వారిలో గ్రామ అధ్యక్షులు పులి రాజు ప్రధాన కార్యదర్శి చాకలి వెంకటేశ్వర్లు, పొలయ తలారి ప్రసాద్, గ్రామ అధ్యక్షురాలు మరియమ్మలు ఉన్నారు.

అబ్బురపరిచే అద్భుతమైనవి బెలుం గుహలు

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన బెలుం గుహలు సహజ సిద్ధంగా ఏర్పడిన అద్భుతమైన గుహలని కేంద్ర పంచాయతీరాజ్ శాఖ జాయింట్ సెక్రెటరీ రాజేష్ కుమార్ సింగ్ అన్నారు. ఆదివారం ఆయన రాయలసీమ పర్యటనలో భాగంగా బెలుం గుహలకు విచ్చేసారు. నంద్యాల జిల్లా డిఎల్‌పీఓ రాంబాబు, ఎంపీడీవో దస్తగిరి బాబు, డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళి గౌడ్, గుహల మేనేజర్ కిషోర్ తదితర అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. గుహలలోని ధ్యాన మందిరం, వెయ్యి పడగలు, మండపం, ఊడలమర్రి,మాయా మందిరం, పాతాళగంగ, స్టాలెక్ టైట్లు,స్టాలెగ్ మైట్లు తదితర ప్రదేశాలను,గుహలు ఏర్పడిన విధానాన్ని,పర్యాటక ప్రదేశంగా ప్రభుత్వం తీసుకున్న చర్యలను గైడ్లు సవివరంగా ఆయనకు తెలిపారు. గుహలను వీక్షించిన అనంతరం ఆయన మాట్లాడుతూ గుహలు ఎంతో అద్భుతంగా ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరూ చూడవలసిన ప్రదేశం అన్నారు. మేఘాలయల్లోని గుహల తర్వాత రెండవ అతిపెద్ద గుహలు బెలుం గుహలేనన్నారు.

ఎల్‌ఈడీ లైట్లతో గ్రామం వెలుగులు

విశాలాంధ్ర - ఉయ్యాలవాడ : మండల కేంద్రమైన ఉయ్యాలవాడలోని వీధులన్నీ ఎల్‌ఈడి లైట్లతో వెలుగులు నింపాయి. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మేకల ఓబులేసు మాట్లాడుతూ ఉయ్యాలవాడ గ్రామంలో ఎల్‌ఈడి వీధిలైట్లు చెడిపోవడంతో వాటిని తీసి మరమ్మతు చేయించి వాటి స్థానంలో బల్బులు వేయించామని ఆయన అన్నారు. దీంతో గ్రామం అంతా నూతన సంవత్సరం బల్బులు వెలిగించామని ఆయన అన్నారు. గ్రామంలో ఆంజనేయ స్వామి గుడి దగ్గర తాగునీటి మెయిన్ పైప్ లైన్ పగిలిపోవడంతో సీసీ రోడ్డు పగలగొట్టి మరమ్మతు చేయించి గ్రామంలో కులాలకు నీరు అందించామని అన్నారు. ప్రతి నెలలో మూడు చోట్ల రిపేరు చేయవలసి వస్తుందని ఆయన అన్నారు. దీనికి గ్రామ ప్రజలు మండల అధికారులు గమనించాలని అన్నారు.

ALLAGADDA MUNICIPALITY

***

Address : Ahobilam Road Allagadda
Telephone No : 8978885220
E-mail id : mc.allagadda@cdma.gov.in

E-Tender: - Toilet Works

Tender Notification No. **08(1-3)/ SAC Funds /ALGM/2025-26**
Dated:30-12-2025

Bid Document Download Start Date and Time : **30-12-2025 @ 10.00 AM**

Bid Document Download End Date and Time : **17-01-2026 @ 04.00 PM**

Bid Submission Closing Date and Time : **17-01-2026 @ 04.30 PM**

E-Tender Website : **https://tender.apeprocurement.gov.in/**

E-Mail ID for Clarifications / Communication : **mc.allagadda@cdma.gov.in**

Note: Any addendum / corrigendum / bid clarifications / time extension shall be issued on the website only. No separate press notification shall be issued.

Contact No: 8978885220 & 7989604855

Sd/-P.Kishore
Commissioner
Allagadda Municipality

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : జిల్లాలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాలను సంబంధిత శాఖల అధికారులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ అనంతరం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందరరేగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని శాఖలు కేంద్ర ప్రాయోజిత పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన నిధులను పూర్తి స్థాయిలో వినియోగించకపోతే, ఆ నిధులు వెనక్కి వెళ్లే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల ప్రతి శాఖ తమకు కేటాయించిన నిధులను సమర్థవంతంగా వినియోగించి అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రత్యేకంగా జల జీవన్ మిషన్, ప్రధానమంత్రి వికసిత్ భారత్ యోజన, కృషి వికాస్ యోజన, పోషణ్ అభియాన్, ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన, మిషన్ వాత్సల్య, త్రిషోన్నతి యోజన, పీఎంఏవై (అర్బన్), ప్రధానమంత్రి ఆది ఆదర్శ గ్రామ యోజన, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం తదితర కేంద్ర ప్రభుత్వ పథకాలపై సమగ్ర నివేదిక సమర్పించాలని తెలిపారు. ప్రతి పథకానికి సంబంధించి మంజూరైన మొత్తం నిధులు, ఇప్పటివరకు ఖర్చు చేసిన మొత్తం, పథకం అమలవుతున్న ప్రాంతాలు, మిగిలి ఉన్న నిధులు, జరుగుతున్న అభివృద్ధి పనులు, పనులు పూర్తయ్యే గడువు వంటి వివరాలతో మంగళవారం ఉదయంలోగా క్లుప్తంగా నివేదికలను తమకు సమర్పించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

పీఈటీ పోస్టులను భర్తీ చేయాలి : ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర - నంద్యాల అర్బన్: నంద్యాల జిల్లాలోని మోడల్ స్కూళ్లలో ఖాళీగా ఉన్న వ్యాయామ ఉపాధ్యాయ పీఈటీ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ఏఐఎస్ఎఫ్ నంద్యాల జిల్లా సమితి డిమాండ్ చేసింది. సోమవారం నంద్యాల కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో జిల్లా కలెక్టర్‌కు, డీఈఓకు ఏఐఎస్ఎఫ్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సూర్య ప్రతాప్ మాట్లాడుతూ.. ఇటీవల నిర్వహించిన డీఎస్సీ ద్వారా అనేక ఉపాధ్యాయ పోస్టులు భర్తీ అయినప్పటికీ, మోడల్ స్కూళ్లలోని పి.ఇ.టి పోస్టులను విస్మరించడం అన్యాయమన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థుల్లో క్రమశిక్షణ లోపిస్తోందని, క్రీడలకు వారు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని కోరారు. అదేవిధంగా, పాఠశాలల్లో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్లు స్వల్ప మరమ్మతుల కారణంగా నిరుపయోగంగా మారాయని తెలిపారు. దీనివల్ల విద్యార్థులు అపరిశుభ్ర నీటిని తాగాల్సి వస్తోందని, వెంటనే వాటిని పునరుద్ధరించాలని కోరారు. వినతిపై స్పందించిన కలెక్టర్.. ఈ సమస్యలపై సమగ్ర నివేదిక అందజేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ప్రవీణ్, శశిధర్ రెడ్డి, నాయకులు మా బాషా తదితరులు పాల్గొన్నారు.

యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : చదువుకున్న యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధి వైపు వెళుతుండటం మంచి శుభ పరిణామమని ఆళ్లగడ్డ 5వ జిల్లా కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బత్తిని శివప్రసాదరావు అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలో పోలీస్ లైన్ వీధిలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీసాయి భవాని ఎంబ్రాయిడింగ్ , మగ్గం వర్క్ షాప్‌ను అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బత్తిని శివప్రసాద రావు సోమవారం రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభి ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకున్న యువత సొసైటీలో చాలామంది ఉన్నారని ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధి వైపు వెళ్లడం మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో సాయి భవాని ఎంబ్రాయిడింగ్ , మగ్గం వర్క్ షాప్ యజమానురాలు సాయి భవాని సుదర్శన్ తో పాటు ఆళ్లగడ్డ బార్ అసోసియషన్ మాజీ అధ్యక్షుడు సీనియర్ న్యాయవాది రమణయ్య మరియు న్యాయవాదులు మురళీధర్ గౌడ్, తిరుపాలు రెడ్డి, శ్రీనివాసులు, సుబ్బయ్య, లత, సుదర్శన్, లక్ష్మి నరహరి, వెంకట ప్రసాద్, రఘురాం రెడ్డి, వెంకటేశ్వర్లు, గణేష్, రాజేష్ తదతరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో నిందితులు అరెస్టు

విశాలాంధ్ర - నందికొట్కూరు : జిల్లా సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ సునిల్ షారోన్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, ఆత్మకూరు డీఎస్పీ ఆర్ రామంజి నాయక్ ఆధ్వర్యంలో నందికొట్కూరు పట్టణ సిఐ వై.ప్రవీణ్ కుమార్, ఎస్సై చంద్రశేఖర్, ఏఎస్ఐ రామచంద్ర, హెడ్ కానిస్టేబుల్ సురేంద్ర, పోలీసు కానిస్టేబుల్స్ యు.బాలకృష్ణ, కె. చిన్న మధు, చెన్నరాయుడు, హెూమ్ గార్డ్స్ సతీష్, గోపాల్‌లు టీములుగా ఏర్పడి గంజాయి అమ్ముతున్న వారిని సోమవారం అరెస్టు చేయడం జరిగింది. ఈ సందర్భంగా పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి విలేకరులకు తెలియజేస్తూ నందికొట్కూరు పట్టణ సమీపంలో ఆత్మకూరుకు వెళ్లే కేజీ రోడ్డులో ఉన్న చాటలమ్మ పొరకలమ్మ గుడి సమీపంలో రాయల్ గ్రీన్ సిటీ వద్ద పక్క సమాచారం మేరకు మధ్యాహ్నం 3.00 గంటలకు అరెస్టు చేసి వారి వద్ద నుండి 2100 గ్రాముల గంజాయిని, నాలుగు సెల్ ఫోన్‌లను రూ.3వేల నగదును సీజ్ చేసి రిమాండుకు పంపడం జరిగిందని తెలిపారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

విశాలాంధ్ర - ప్యాపిలి : పట్టణ ప్రజలు, దుకాణాల యజమానులు, తోపుడుబండ్ల వ్యాపారస్తులు ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఎస్సై నాగార్జున అన్నారు. సోమవారం స్థానిక సర్కిల్ పోలీస్ స్టేషన్ కార్యాలయంలో దుకాణాల యజమానులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో మర్చంట్ వ్యాపారస్తులు, కిరాణం, బట్టలు, ఎరువు, పెయింట్, ఎలక్ట్రికల్ షాపులు, తోపుడు బండ్ల పండ్ల వ్యాపారస్తులకు ట్రాఫిక్ నియంత్రణ పాటించాలని, దుకాణాల ముందు రోడ్డుపై వాహనాలు ఆపకుండా లోడింగ్-అన్‌లోడింగ్ సమయంలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా దుకాణదారులు చర్యలు తీసుకోవాలని గ్రామాల్లో, ప్యాపిలిలో తోపుడు బండ్లు కేటాయించిన ప్రదేశాల్లోనే ఉంచాలని ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూసుకోవాలని ఇలా అందరూ పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చని ఆయన అన్నారు. బస్టాండ్ ఆవరణలో విచ్చలవిడిగా ద్విచక్రవాహనాలు నిలిపి బస్సుల రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్న వాహనదారులకు ఇప్పటి వరకు 200 వాహనాలు పైన రూ.35 వేలు జరిమానా విధించామని సరైన పత్రాలు లేని 30 బైక్‌లను ఆర్టీవో అధికారులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శివకుమార్ గౌడ్, దుకాణముల యజమానులు, తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో ఆర్టీసీ బస్ సర్వీసులు

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : ప్రజలకు సకాలంలో ఆర్టీసీ బస్సు సర్వీసులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని బనగానపల్లి ఆర్టిసి డిపో మేనేజర్ శశి భూషణ్ తెలిపారు. రాష్ట్ర రహదారులు భవనాల శాఖామంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆదేశాలతో సోమవారం మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ నందు బనగానిపల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సుల రాకపోకలను ఆయన కంట్రోలర్ కాశయ్యతో కలిసి పరిశీలించారు. టైమింగ్స్ ప్రకారం ఆయా రూట్లలో బస్ లు చేరుకుంటున్నాయా లేదా ప్రయాణికులకు ఇబ్బంది కలుగుతుందా తదితర వివరాలను సేకరించారు. ఇటీవల బనగానపల్లె ఆర్టీసీ డిపో బస్సులు సమయపాలన పాటించకుండా ఇష్టానుసారంగా రాకపోకలు సాగిస్తున్నడంపై పెద్ద ఎత్తున ఆరోపణలు వెలువత్తాయి. ఒకేసారి నాలుగైదు బస్సులు వెనువెంటనే ఒకే రూట్లో వెళ్లి ఆ తర్వాత గంటలకొద్దీ బస్సుల కోసం ప్రయాణికులు వేచి చూస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా బనగానపల్లి తాడపత్రి రూట్లలో తిరిగే బస్సుల పైనే ఆరోపణలు వెల్లువెత్తడంతో ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టారు.

మట్టి తవ్వకాలను ఆపండి

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల పరిధిలోని మహాదేవపురం గ్రామంలో గ్రామం పుట్టినప్పటి నుండి ఉన్నటువంటి పోలేరమ్మ రస్తా, పొలాలకు ,సర్వ నరసింహస్వామి ఆలయానికి రాకపోకలకు సౌకర్యంగా ఉన్న రస్తాను మట్టి వ్యాపారస్తులు జేసీబీ యంత్రాలతో ధ్వంసం చేసి మట్టిని తోడేసి ఇతర ప్రాంతాలకు తరలించి అమ్ముకున్నారని. నిబంధనలకు విరుద్ధంగా అధిక లోతు గుంతలు ఏర్పడే విధంగా మట్టిని తోడేసిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని పార్టీలకు కులమతాలకు అతీతంగా తరలివచ్చిన మహదేవాపురం గ్రామ ప్రజల సమక్షంలో ఆళ్లగడ్డ మాజీ శాసనసభ్యులు గంగుల బిజేంద్రారెడ్డి , వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రామ్ భూపాల్ రెడ్డి ఇతర వైసీపీ నేతలు ప్రముఖులు నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియ గారికి వినతి పత్రం అందజేశారు. ప్రజలు మండల స్థాయి అధికారులకు ఫిర్యాదులు చేయడం జరిగిందని. 2025 డిసెంబర్14వ తేదీ అర్ధరాత్రి, 2025 డిసెంబర్ 26వ తేదీ అర్ధరాత్రి పోలేరమ్మ రస్తాను తోడేస్తూ మట్టిని అమ్ముతున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. మట్టి వ్యాపారులు అర్ధరాత్రిలు అలజడులు సృష్టిస్తూ భయభ్రాంతులకు పాల్పడుతూ గ్రామస్తులు ఎవరూ అడ్డు రాకుండా రాత్రులకు రాత్రిళ్ళు పోలేరమ్మ రస్తాను త్రవ్వి మట్టిని టిప్పర్ల ద్వారా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. శిరివెళ్ల ఎస్ఐ వారి వద్దకు వెళ్లి జేసీబీ యంత్రాలను టిప్పర్లను స్వాధీనం చేసుకోవాలని గ్రామస్తులు అందరూ కోరినప్పటికీ ఎటువంటి స్పందన లేదని. ఎంపీడీవో సి.శివ మల్లేశ్వరప్ప రోడ్డు అభివృద్ధికి గాను ఇచ్చిన తీర్మానం ఆసరాగా చేసుకుని పూర్వం నుండి ఉన్నటువంటి పోలేరమ్మ రస్తా ధ్వంసం చేశారన్నారు. మట్టిని త్రవ్వమని ఎక్కడే గాని అనుమతి ఇవ్వలేదని ఎంపీడీవో అన్నారు. తహసీల్దార్‌ని కలిసి మట్టి వ్యాపారులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరగా మట్టి తవ్వకాలు ఆపాలని స్థానిక పోలీసులకు తెలియజేశారు. జిల్లా ఎస్పీకి, కలెక్టర్‌కి స్థానిక పోలీసులకు తహసీల్దార్‌కి తెలియజేసినప్పటికీ ప్రేక్షకపాత్ర వహించడం పట్ల మాజీ ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలేరమ్మ రస్తాను ధ్వంసం చేసి అక్రమంగా మట్టిని తరలించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని జేసీబీ యంత్రాలను టిప్పర్లను, ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని గ్రామ ప్రజలందరికీ న్యాయం చేయాలని పార్టీలకు అతీతంగా తరలివచ్చిన గ్రామ ప్రజల సమక్షంలో జిల్లా కలెక్టర్‌కి మాజీ ఎమ్మెల్యే గంగుల వినతి పత్రం అందజేశారు.

ప్రకృతి పంటలే ఆరోగ్యానికి శ్రేయస్కరం

విశాలాంధ్ర - చాగలమర్రి : ప్రకృతి సాగుతో పండించిన పంటలను ఆహారంగా తీసుకోవడం ఆరోగ్యానికి శ్రేయస్కరమని ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జి పి.నాగేశ్వరరెడ్డి,ఎంపీడీవో కార్యాలయ సీనియర్ సహాయకులు బాలనరసింహులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన కూరగాయలు,ఆకుకూరల స్టాల్ ఏర్పాటు చేశారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల పట్ల ప్రజలు చూపిన స్పందనపై నిర్వాహకులు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానాలు భూసారాన్ని కాపాడుతూ తక్కువ ఖర్చుతో సాగు చేయడానికి దోహదపడతాయని, పర్యావరణ సమతుల్యతను నిలబెట్టడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. సహజంగా పండిన ఆహార పదార్థాలను వినియోగించడం ద్వారా రసాయనాల ప్రభావం తగ్గి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ రూపసి రాజ్, కమ్యూనికేషన్స్ ఎస్ఎఫ్ఐ అభిషేక్ రాజ్, జిఎస్‌డబ్ల్యూఎస్ సిబ్బంది పర్వీన్,హరిత,యూనిట్ ఇన్‌చార్జ్ నిరంజన్, ఐసీఆర్పీలు భాషా, లక్ష్మి నరసమ్మ, రైతులు పాల్గొన్నారు.

వసతి గృహాలకు విరాళం

విశాలాంధ్ర - పాణ్యం : ప్రముఖ దైవ క్షేత్రం కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి సోమవారం కర్నూలు పటానికి చెందిన పి.రమేష్ భరద్వాజ్ భక్తుడు రూ.1లక్ష 1116 రూపాయలు ఇచ్చినట్లు ఆలయ అధికారి రామకృష్ణ తెలిపారు. ఆలయ అధికారి మాట్లాడుతూ కీర్తిశేషులు మల్లికార్జున శాస్త్రి జ్ఞాపకార్థం కుమారుడు రమేష్ భరద్వారాజ్ వారి ఇంటి ఇలవేల్పు కావడంతో వసతి గృహాల కొరకు నగదు ఇవ్వడం జరిగిందన్నారు. వారికి అర్చకుడు సురేష్ శర్మ ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదం అందజేశారు అనంతరం శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది,మిలిటరీ సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వెంకట్రామిరెడ్డి సేవలు మరువలేనివి

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్ : వెంకట్రామిరెడ్డి భారతీయ జనతా పార్టీకి చేసిన సేవలు మరువలేనివి, మండల అధ్యక్షుడిగా అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొంటూ పార్టీ బలోపేతానికి కృషి చేశారని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు మైనార్టీ మోర్చా నాయకురాలు మోమిన్ షబాన అన్నారు. వెంకట్రామిరెడ్డి పార్థివ దేహానికి బీజేపీ జెండా కప్పి అతనికి నివాళులర్పించారు. ఆత్మకూరు పట్టణ అధ్యక్షులు రవీంద్రారెడ్డి, బండి ఆత్మకూరు మండల అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, మహానంది మండల అధ్యక్షుడు కిరణ్ గౌడ్, వెలుగోడు మండల అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, ఏబీవీపీ నాగేశ్వరరావు, ఆత్మకూరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చిట్యాల పద్మావతి, బిజెపి సీనియర్ నాయకులు చల్లా దామోదర్ రెడ్డి, బిజెపి నాయకులు అందరూ పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకలను మొక్కలు, విద్యాసామగ్రి ద్వారా జరుపుకుందాం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : జనవరి వేడుకలకు జిల్లాలో ఉండే అధికారులందరూ కూడా బొకేలు కేకులతో కాకుండా మొక్కలతో, విద్యా సామాగ్రితో జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక నందు అధికారులకు పిలుపునిచ్చారు. జూనియర్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో వివిధ అధికారుల వద్ద సేకరించిన మొక్కలను ప్రభుత్వ విద్యా సంస్థలలో నాటించడం జరుగుతుందని విద్యా సామాగ్రిని హాస్టల్స్‌లో పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల, సెక్రటరీ, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి శ్రీకాంత్ రెడ్డి,కోశాధికారి నాగేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉస్మాన్‌భాష, డిఎఫ్ఓ అబ్దుల్ సమి తదితరులు పాల్గొన్నారు.

మంచి దిగుబడికి మంచి సలహాలు

విశాలాంధ్ర - వెలుగోడు: రైతులు తమ పంట పొలాల్లో మంచి దిగుబడి సాధించాలంటే వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని ఏడీఏ సరళమ్మ తెలిపారు. ప్రధాన మంత్రి రాష్ట్రీయ కృషి వికాస యోజన పథకం కింద భూసార పరీక్ష ఫలితాల పత్రాలపై రైతులకు అవగాహన సదస్సు సోమవారం వెలుగోడు గ్రామంలో రైతు సేవా కేంద్రంలో జరిగింది. నంద్యాల డిఆర్‌సి నుండి ఎడిఎ సరళమ్మ, వ్యవసాయ అధికారులు స్వాతి, వెంకటేశ్వర రెడ్డి, హేమసుందర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

యాగంటి క్షేత్రం దర్శించుకున్న సహాయ కార్యదర్శి

విశాలాంధ్ర - బనగానపల్లె రూరల్: బనగానపల్లె మండలం యాగంటిలో వెలసిన ప్రముఖ శైవ క్షేత్రమైన ఉమామహేశ్వర స్వామి వారిని సోమవారం పంచాయతీ రాజ్ శాఖ సహాయ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్య నిర్వహణ అధికారి డి.పాండురంగారెడ్డి ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఉమామహేశ్వర స్వామికి రాజేష్ కుమార్ సింగ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వారికి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు. డిప్యూటీ ఎంపీడీవో బాలాంజనేయులు, పాతపాడు సర్పంచ్ మహేశ్వర్ రెడ్డి, యాగంటి పల్లె ఉప సర్పంచ్ మౌళిశ్వర్ రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభసాటి

విశాలాంధ్ర-అవుకు: ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులకు లాభసాటి ఫలితాలు ఇస్తుంది అని మండల వ్యవసాయ అధికారిని కలిమున్నీసా అన్నారు. సోమవారం పట్టణంలోని మండల సమాఖ్య కార్యాలయం నందు వ్యవసాయ శాఖ, సెర్ప్,అనుబంధ శాఖలతో ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో మండల స్థాయి సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారిని మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలు, ఖర్చులు తగ్గింపు, నేల సారవంతం పెంపు, దీర్ఘకాలిక ఆదాయ అవకాశాల గురించి తెలియజేశామని అన్నారు. సెర్ప్ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ నాగరాజు మాట్లాడుతూ పొదుపు సంఘాలలోనే ప్రతి మహిళా సభ్యురాలు ఇంటి వద్ద పెరటి తోటలు ఏర్పాటు చేసుకోవాలని, పొలం ఉన్న ప్రతి మహిళ ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి మెరుగైన ఆదాయం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రక ృతి వ్యవసాయ విభాగాము ఎన్ఎస్ఎ రామకృష్ణ, వ్యవసాయ సహాయకులు, వివో ఏలు, ఎంఎస్‌ఓబిలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

దొంగ ఓట్లతోనే బీజేపీ అధికారం

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ :దొంగ ఓట్లతోనే బీజేపీ అధికారంలోకి వచ్చిందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. సోమవారం పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు నాగ మధు, స్టేట్ మాజీ పీసీసీ ప్రధాన కార్యదర్శి చింతల మోహన్ రావు, మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని వారు మండిపడ్డారు. వెంటనే ఈ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం వెంకటాపురం గ్రామానికి చెందిన కృష్ణారెడ్డిను కాంగ్రెస్ పార్టీ కండువాతో సాదరంగా ఆహ్వానించారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 30, డిసెంబరు 2025

ఆర్టీసీ లోటు భర్తీకి రూ.160 కోట్లు : ఆర్టీసీ ఎండీ

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆర్టీసీ లోటును భర్తీ చేసేందుకు, ప్రతి నెలా 160 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమల నాయుడు అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన ఎమ్మినూరు ఆర్టీసీ డిపోకు వచ్చారు. ముందుగా బస్టాండు ప్రాంగణాన్ని బస్సుల కోసం వేచి ఉన్న విద్యార్థులతో మాట్లాడుతూ బస్సు సౌకర్యాలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. శ్రీ శక్తి పథకం వల్ల టికెట్ల ద్వారా ఆదాయం తగ్గిపోయిందన్నారు. ఈ లోటు భర్తీ చేసేందుకే ప్రభుత్వం ప్రతినెల 160 కోట్లు మంజూరు చేస్తుందని, గత రెండేళ్ల కాను ప్రభుత్వం 400 కోట్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.ఇందులో 160 కోట్లు నిన్ననే డ్రా చేసినట్లు ఆర్టిసి ఎండి వివరించారు. ఆర్టీసీకి త్వరలోనే కొత్త బస్సులు రాబోతున్నాయని, ఎలక్ట్రికల్ బస్సులు వస్తున్నాయన్నారు. ఎలక్ట్రికల్ బస్సులు రావడానికి కాస్త ఆలస్యం కావచ్చని, ఈ బస్సులు ఏర్పాటు చేసేందుకు విద్యుత్ సబ్‌స్టేషన్ తో పాటు, చార్జింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ బస్సులకు తగ్గట్టు టికెట్ చార్జీలు ఉండవచ్చని వివరించారు. ఆర్టీసీకి కార్గో సర్వీస్ ద్వారా ఆదాయం గణనీయంగా పెరిగిందని ఆయన వివరించారు. త్వరలో ప్రభుత్వం ఆర్టీసీ అభివృద్ధికి రూ.8 వందల కోట్లు మంజూరు చేయబోతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో బస్టాండ్ ప్రాంగణాల అభివృద్ధి జరుగుతోందని తెలిపారు. గుత్తి, రాయదుర్గం, గుడివాడ బస్టాండ్ ప్రాంగణాలను అభివృద్ధి చేయడానికి, ఒక్కొక్క దానికి ఆరు కోట్లు చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. మహిళా ప్రయాణికులు సంఖ్య పెరిగిపోవడం వల్ల, ఆర్టీసీ బస్టాండ్లో పరిశుద్ధ పరిశుభ్రతను నెలకొల్పేందుకు కృషి చేస్తున్నామన్నారు. బస్టాండ్ ను పరిశుభ్రం చేసే కాంటాక్టను సక్రమంగా పనిచేయకపోతే వారిని, తొలగించి వారి స్థానంలో కొత్త వారిని నియమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూల్ ఆర్ ఎం వెంకటేశ్వర్లు డిపో మేనేజర్ మద్దిలేటి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టం పేరు మార్పు వెనక్కి తీసుకోవాల్సిందే

విశాలాంధ్ర-పత్తికొండ: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి పేరు మార్పు చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాల్సిందేనని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అవుల శేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం కర్నూలు జిల్లా పత్తికొండ చదువుల రామయ్య భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత వ్యవసాయ కూలీలు వలసలు వెళ్లకుండా ఉండేందుకు యూపీఏ ప్రభుత్వ హయాంలో కమ్యూనిస్టు పార్టీల డిమాండ్ మేరకు మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని తీసుకు రావడం జరిగిందన్నారు. ఈ పథకం వలన గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ కార్మికులు కొంతవరకు మెరుగైన జీవనం గడుపుతున్నారన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడుస్తూ, ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పడుతుందని విమర్శించారు. మారిన కొత్త చట్టం ప్రకారం కేంద్రం 60 శాతం నిధులు, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులను ఖర్చు చేయాలనే నిబంధనలు విధించడం వలన తీవ్ర ఇబ్బందులు తలెత్తడం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ కూలీలు, కార్మికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని, కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేనియెడల వ్యవసాయ కూలీలతో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నభీరసూల్, ఉమ్మడి కర్నూలు జిల్లా సీపీఐ మాజీ జిల్లా కార్యదర్శి పి. భీమ లింగప్ప, నియోజకవర్గ కార్యదర్శి వెంకట రామిరెడ్డి, జిల్లా సమితి సభ్యులు కారన్న, పెద్ద ఈరన్న, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నరసింహులు, ఉరుకుందు, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

సైనిక కుటుంబాలకు అండగా నిలుద్దాం

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : దేశ రక్షణలో ప్రాణత్యాగం చేసిన సైనికులు, మాజీ సైనికుల కుటుంబాలకు అండగా నిలవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి సూచించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో మెప్మా మహిళా సంఘాల నుంచి సాయుధ దళాల సంక్షేమ నిధికి సేకరించిన రూ. 2 లక్షల చెక్కును మహిళా సంఘాల సభ్యులు కలెక్టర్‌కు అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, గూడూరు మున్సిపాలిటీల్లో మహిళా సంఘాల సభ్యులు తమ వంతు బాధ్యతగా రూ. 2 లక్షల చెక్కును అందజేశారని, సైనిక కుటుంబాలకు సహాయం చేయాలనే ఉద్దేశంతో మహిళా సంఘాలు ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ సామర్థ్యాన్ని బట్టి ఫ్లాగ్ డే నిధికి విరాళాలు అందించి దేశసేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.శ్రీనివాసులు, జిల్లా సైనిక సంక్షేమ అధికారి రత్న రూత్, జిల్లా సమాఖ్య ప్రెసిడెంట్ టి.పద్మ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ సబ్‌జూనియర్ పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర - కర్నూలు వైద్యశాల: కర్నూలు నగరంలోని ఆదర్శ కళాశాల మైదానంలో సోమవారం ఉదయం రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ రగ్బీ పోటీలు ప్రారంభమైనాయి. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా ప్రముఖ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ వైద్యులు డాక్టర్ బి.శంకర్ శర్మ హాజరయ్యారు. ఈపోటీలలో పాల్గొనేందుకు రాష్ట్రంలోని 15 జిల్లాల క్రీడాకారులు పాల్గొన్నారు. ఈపోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారు లను జాతీయ జట్టుకు ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో సైతం పాల్గొనాలని కోరారు. క్రీడల్లో రాణిస్తే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వస్తుందని అందుకు భారత మహిళా క్రికెట్ జట్టు నిదర్శనం అన్నారు. విద్యార్థులు క్రీడల్లో పాల్గొంటే చదువుల్లో రాణించడంతో పాటు భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలు సైతం క్రీడా కోటలో వస్తుందని ఆయన తెలిపారు. విద్యార్థులు సెల్ ఫోన్‌కి దూరంగా ఉండి మంచి ఆహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. క్రీడా ప్రతినిధులు రామాంజనేయులు, సురేంద్ర తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పేదలకు అండ ఎర్రజెండా

పి.గోవిందు కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం

విశాలాంధ్ర - కర్నూలు : పేదలకు ఎల్లప్పుడు ఎర్ర జెండ అండగా ఉంటుందని సీపీఐ నాయకులు అన్నారు. సోమవారం సీపీఐ శత వార్షికోత్సవాల ముగింపు సందర్భంగా కర్నూలు నగరంలో రాజీవ్ గృహకల్ప గృహాలకు ఎదురుగా ఉన్న గోవిందు కాలనీలో జెండా ఎగర వేసి, అనంతరం అకాల మృతి చెందిన కామ్రేడ్ గోవిందు సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాఖ కార్యదర్శి రామాంజనేయులు అధ్యక్షత వహించగా ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైఎల్ రామాంజనేయులు, సీపీఐ సీనియర్ నాయకులు జగన్నాథం, నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరైన జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ దేశంలో సీపీఐ ఎర్ర జెండాకి వందేళ్లు పూర్తయినప్పటికీ వన్నె తగ్గకుండా పేద ప్రజల పక్షాన నికార్సైన ఉద్యమాల నిర్వహిస్తూ నిజాయితీగల పార్టీలు ఏవైనా ఈ దేశంలో ఉన్నాయా అని అడిగితే కమ్యూనిస్టు పార్టీ లేనని గర్వంగా చెప్పుకోవచ్చన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఏమాత్రం పాత్రలేని బీజేపీ మతాల మధ్య కులాల మధ్య చిచ్చు పెడుతుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నిటిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తూ దేశంలోని అడవులను మైదాన ప్రాంతాలను కొంతమంది కోటీశ్వరులకు అప్పగిస్తుందని విమర్శించారు. రాబోయో రోజుల్లో ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తూ పేద, బడుగు, బలహీన వర్గాలకు, ఆదివాసులకు అండగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. కామ్రేడ్ గోవిందు భార్య దుర్గమ్మకి సీపీఐ సీనియర్ నాయకులు కామ్రేడ్ కే జగన్నాథం, ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై ఎల్ రామాంజనేయులు నగర పార్టీ ఆధ్వర్యంలో రూ 50వేల రూపాయలు అందించేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మోటార్ రాముడు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.శ్రావణి, నగర సహాయ కార్యదర్శులు డి.శ్రీనివాసరావు, మహేష్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గిడ్డమ్మ, మహిళా సమాఖ్య నగర కార్యదర్శి భారతి, నగర కార్యవర్గ సభ్యులు నల్లన, వెంకటేష్, ఎం.బీసన్న, అన్వర్,కిట్టు, అశోకు, ధనలక్ష్మి రైతు సంఘం కల్లూరు మండల కార్యదర్శి రాముడు, వెంకట్ రమణ కాలనీ రాము పాల్గొన్నారు.

శివానిని సన్మానించిన జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా వీర్ బాల్ పురస్కారం అందుకున్న మద్దికెర మండలానికి చెందిన క్రీడాకారిణి శివానిని సోమవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలల ధైర్యాన్ని, త్యాగాన్ని స్మరించుకుంటూ ఢిల్లీలో నిర్వహించిన వీర్ బాల్ దివస్ -2025 కార్యక్రమం సందర్భంగా రాష్ట్రపతి చేతుల మీదుగా క్రీడా విభాగంలో మద్దికెర మండలానికి చెందిన శివాని వీర్ బాల్ పురస్కారం అందుకుందని అభినందించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో జావెలిన్ త్రో, షాట్ పుట్ పోటీల్లో గెలుపొంది, పథకాలు సాధించిన శివాని జిల్లాకు గర్వకారణమని, అంగ వైకల్యం ప్రతిభకు అడ్డు కాదని శివాని నిరూపించిందని కలెక్టర్ అన్నారు. శివాని విద్యార్థులకు, క్రీడాకారులకు ఆదర్శంగా నిలుస్తుందని కలెక్టర్ తెలిపారు. ఐసీడీఎస్ పీడీ విజయ పాల్గొన్నారు.

రేషన్ పంపిణీలో అవకతవకలపై కఠిన చర్యలు

విశాలాంధ్ర - ఆలూరు : మండల తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఏలతో సమావేశం నిర్వహించి, సోమవారం ఆర్ఐ బస్వన్ గౌడ్ వీఆర్ఏలతో మాట్లాడుతూ కీలక సూచనలు, సలహాలు ఇచ్చారు. జనవరి 1వ తేదీ నుంచి గ్రామాల్లో రేషన్ బియ్యం ప్రతి ఇంటికి సక్రమంగా చేరుతున్నాయా, లేదా అన్న విషయాన్ని క్షుణ్ణంగా పర్యవేక్షించాలని ఆయన ఆదేశించారు. రేషన్ డీలర్లు ఏవైనా అవకతవకలకు పాల్పడుతున్నట్లు గుర్తిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ ప్రక్రియలో వీఆర్‌ఏలు, తలార్లు భాగస్వాములై ప్రతి అర్హత కుటుంబానికి రేషన్ అందేలా బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగించినా లేదా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవన్నారు.

ఆదోని జిల్లాతోనే అభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర-పత్తికొండ: ఆదోని జిల్లాతోనే అభివృద్ధి సాధ్యమని లోక్ సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు ఆనందాచారి అన్నారు. సోమవారం లోక్ సత్తా పార్టీ ఆధ్వర్యంలో నాలుగు స్తంభాల మండపం దగ్గర ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం జిల్లాల ఏర్పాటులో ఆదోని జిల్లాగా ఏర్పాటు చేయక పోవడం ఈ ప్రాంత వాసులను మోసం చేయడమేనని, పరిపాలన సౌలభ్యం కోసం తక్షణమే ఆదోనిని జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లోక్ సత్తా పార్టీ తాలూకా అధ్యక్షులు జయరాముడు, నాయకులు ప్రసాద్, సుధాకర్, షరీఫ్, శ్రీనివాసులు, రంగన్న, పటేల్, దేవన్న, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ కాలనీ కొట్టాలకు పట్టాలు ఇవ్వాలి

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : నగరంలోని 19 వ వార్డులోని పార్థసారథి రాజీవ్ కాలనీ లోని పేద ప్రజలు గత 23 సంవత్సరాలుగా కొట్టాలు వేసుకుని జీవనం కొనసాగిస్తున్నారని, వారికి పట్టాలి ఇవ్వాలని కోరుతూ సీపీఐ నగర సహాయ కార్యదర్శి సి.మహేష్ మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ ఆర్జీవీ కృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజీవ్ కాలనీలోని దాదాపు 100 మంది నిరుపేద కుటుంబాలు కొట్టాలు వేసుకుని జీవనం కొనసాగిస్తున్నారని. ఈ ఏడాది సెప్టెంబర్ నెలలో హైకోర్టు ఆశ్రయించగా వారికి అను కూలంగా కోర్టులో స్టే వచ్చినదని, అయితే మున్సి పల్ అధికారులు వారి కొట్టాలను తొలగిస్తామని ఇబ్బందులకు గురి చేస్తున్నారని, హైకోర్టు స్టే ఆర్డర్ ఉండగా ఏ విధంగా తొలగిస్తారు అని మున్సిపల్ అధికారులకు వివరించడం జరిగిందని వారు అన్నారు. తక్షణమే అక్కడే నివాసం ఉండే పేద ప్రజలకు ఇంటి పట్టా మంచినీటి సౌకర్యం రోడ్లు డ్రైనేజీ సౌకర్యాలు కల్పించాలని ఈ సందర్భంగా అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ఇంటి పట్టాతో పాటు ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షల రుణాలు మంజూరు చేయాలని వారి సందర్భంగా తెలిపారు. ఈ సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు సీపీఐ వారికి అండగా ఉంటుందని ఈ సందర్భంగా వారు అన్నారు. ఈ కార్యక్రమంలో నగర సమితి సభ్యులు కుమార్ రాజా, సుధాకర్, రమేష్, శ్రీను, ఏసన్న తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలి

విశాలాంధ్ర - సి.బెళగల్ : నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై వేణుగోపాల్ రాజు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 31వ అర్ధరాత్రి నుంచి ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా డీజేలు టపాసులు, నిషేధించబడినని, యువత మద్యం మత్తులో వాహనాలు నడపడం రహదారులను బ్లాక్ చేసి వేడుకలు చేస్తేకఠినచర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు. ర్యాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, సైలెన్సర్లను తీసి వాహనాలను నడిపితే వాహనాలు సీజ్ చేసి కఠిన చర్యల తీసుకుంటామన్నారు. యువత తల్లిదండ్రులు రాత్రి వేళల్లో వారి పిల్లలు ఎక్కడున్నారనే విషయాన్ని గ్రహించి వారిని బయట పోయి తిరగకుండా చూసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఎస్సై సూచించారు.

ఆకస్మిక తనిఖీలు ఉంటాయి, అప్రమత్తం ఉండాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ప్రజల నుంచి వివిధ శాఖలకు అందుతున్న అర్జీలను నాణ్యతతో నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ అర్జీలు పెండింగ్ లేకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఒకే అంశంపై మళ్లీ మళ్లీ అర్జీలు వచ్చే పరిస్థితి ఏర్పడకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించే అవకాశం ఉన్నందున, అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ప్రతి శాఖలో పనితీరు మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలని, రికార్డులు, నివేదికలు పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి శాఖలో ఫైళ్ల నిర్వహణ పూర్తిగా ఈ-ఆఫీస్ ద్వారానే జరగాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ భౌతిక ఫైళ్ల నిర్వహణ జరగకూడదని స్పష్టం చేశారు..అలాగే, ప్రతి కార్యాలయానికి సంబంధించిన ఈపీటీఎస్ ఆన్లైన్ పోర్టల్‌లో అవసరమైన డాక్యుమెంట్లను నిర్దేశిత గడువులోగా తప్పనిసరిగా అప్లోడ్ చేయాలని సూచించారు. కొన్ని శాఖల్లో డాక్యుమెంట్ల అప్లోడ్ పురోగతి తక్కువగా ఉందని, వారంలోపు పురోగతి సాధించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పచ్చదనం పెంపొందించేందుకు మొక్కలు నాటాలని కలెక్టర్ సూచించారు. మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడడంతో పాటు, ఆరోగ్యకరమైన పని వాతావరణం ఏర్పడుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించండి

విశాలాంధ్ర - కర్నూలు సిటీ: ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని నగరపాలక సంస్థ ఇంచార్జీ కమిషనర్ ఆర్జీవీ కృష్ణ సూచించారు. సోమవారం స్థానిక ఎస్బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ వార్డుల నుండి 21 అర్జీలను స్వీకరించిన ఇంచార్జీ కమిషనర్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, కార్యదర్శి నాగరాజు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగశివ ప్రసాద్, డీసీపీ బి.వెంకటరమణ, ఎంఈ మనోహర్, ఆర్ఓ జునైద్, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, టిడ్కో అధికారి పెంచలయ్య పాల్గొన్నారు.

గోనెగండ్ల సీఐగా చంద్రబాబు బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర -గోనెగండ్ల: సీఐగా చంద్రబాబు సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సీఐగా సేవలందిస్తున్న విజయభాస్కర్ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో చంద్రబాబు వచ్చారు. గతంలో ఈయన ఆదొని, నందికొట్కూరు, ఎస్సైగా సేవలందించి, పదోన్నతిపై శ్రీశైలం రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐగా బాధ్యతలు నిర్వర్తించారు. అక్కడి నుంచి బదిలీపై గోనెగండ్లకు వచ్చారు.

నేడు గూడూరులో బీకేఎంయూ సమావేశం

విశాలాంధ్ర-గూడూరు: నేడు గూడూరు నగర పంచాయతీలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం తాలూకా సమావేశం నిర్వహిస్తున్నట్లు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి శేషు కుమారు తెలిపారు. సోమవారం పట్టణంలో సీపీఐ, ఏఐటీయూసీ నేతలతో సమావేశం నిర్వహించారు. బీకేఎంయూ సమావేశానికి ముఖ్య అతిథులుగా వ్యవ సాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆవుల శేఖర్, జిల్లా కార్యదర్శి నభీ రసూల్, కోడుమూరు మండల సీపీఐ కార్యదర్శి బి.రాజు, గూడూరు కార్యదర్శి బీడీల శ్రీనివాసులు హాజరవుతున్నట్లు తెలిపారు.

జిల్లా ప్రధాన కార్యదర్శి పదవి ఇచ్చినందుకుకృతజ్ఞతలు

విశాలాంధ్ర - పెద్దకడబూరు : టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాధ్యతలును అప్పగించి నందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు, విద్య శాఖ మంత్రి నారలోకేష్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. సోమవారము మండలంలోని స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తనకు జిల్లా పదవి రావడానికి సహకరించిన ఎమ్మెల్సీ బీటీ నాయుడు, మంత్రాలయం ఇంచార్జి ఎస్.రాఘవేంద్ర రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు బసలదొడ్డి ఈరన్న, మండల అధ్యక్షులు గవిగట్టు మల్లికార్జునలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలును తెలిపారు.

రేషన్ డీలర్లపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-పత్తికొండ: రేషన్ డీలర్ల పై చర్యలు తీసుకోవాలని బిజెపి అసెంబ్లీ కోకన్వీనర్ గోవర్ధన్ నాయుడు, మండల అధ్యక్షులు కరణం నరేష్ డిమాండ్ చేశారు. సోమవారం బీజేపీ నాయకులు ఆర్డీవో భరత్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్తికొండ డివిజన్‌లో వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి దగ్గరికే వెళ్లి రేషన్ సరఫరా చేయాల్సి ఉండగా, రేషన్ డీలర్లు పాటించడం లేదన్నారు. రేషన్ దుకాణాలలో ప్రజలకు పంపిణీ చేసే సరుకులు, బియ్యం తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రేషన్ పంపిణీలో మోసాలకు పాల్పడుతున్న డీలర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దండి మల్లికార్జున, శంకరయ్య, వీరేష్, గోరంట్ల, చంద్రన్న, రామాంజనేయులు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సర్వజన వైద్యశాలకు కంప్యూటర్లు విరాళం

విశాలాంధ్ర - కర్నూలు వైద్యశాల: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు శ్రీ సహస్ర హాస్పిటల్ కర్నూలు యాజమాన్యం రూ.2.60 లక్షల విలువగల నాలుగు కంప్యూటర్‌లను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్ పర్యవేక్షకులు డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆసుపత్రి సేవల బలోపేతం కోసం ఈ విరాళం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అత్యవసర సేవలు మరింత వేగవంతం చేయడంలో, రోగుల రికార్డు నిర్వహణలో ఆల్ ఇన్ వన్ సిస్టమ్స్ కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ విలువైన సహకారం అందించిన శ్రీ సహస్ర హాస్పిటల్ వ్యవస్థాపకులకు కర్నూలు ప్రభుత్వ సర్వ జన వైద్యశాల సిబ్బంది హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియ చేశారు. విరాళంగా అందిన ఈ నాలుగు కంప్యూటర్‌లను ఆసుపత్రి ఎమర్జెన్సీ విభాగాల్లో వినియోగానికి కేటాయించనున్నట్లు తెలిపారు. ఆసుపత్రి ఆర్ఎంఓ డా.వెంకటరమణ, శ్రీ సహస్ర హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డా.సీహెచ్ రాజేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

మార్పు దిశగా అడుగులా..?

- ఆలూరు జనసేనపై వార్తా కథనంతో కదిలిన నేతలు
- ఇంచార్జీపై జిల్లా స్థాయి చర్చా..
- విలేఖరిపై కేసు నమోదుకు పోలీసుల నిరాకరణ
- ప్రెస్ మీట్లతోనే సరిపెట్టుకున్న మండల నాయకులు

విశాలాంధ్ర - ఆస్పరి : ఆలూరు నియోజకవర్గంలో జనసేన పార్టీ ఉనికిపై సోమవారం ప్రచురితమైన వార్త రాష్ట్రస్థాయిలో చర్చనీయాంశంగా మారినట్లు తెలుస్తోంది. ఈ కథనంపై జనసేన అధిష్టానం సీరియస్‌గా స్పందించినట్లు సమాచారం. జిల్లా నాయకత్వంతో పాటు ఆలూరు జనసేన ఇంచార్జి తేర్నెకల్లు వెంకప్ప వ్యవహారంపై ప్రత్యేకంగా చర్చించినట్లు పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి, స్థానికంగా నాయకత్వ లోపం, కార్యకర్తల్లో నెలకొన్న అసంతృప్తి వంటి అంశాలపై అధిష్టానం దృష్టి సారించినట్లు సమాచారం. ఈ పరిణామంతో ఆలూరు జనసేన రాజకీయాల్లో కొత్త చర్చ మొదలైంది. ఈ వార్త వెలువడిన వెంటనే జన సేన పార్టీ మండల నాయకులు సోమవారం గాంధీ పార్కులో ప్రెస్ మీట్లు ఏర్పాటు చేసి, ఇంచార్జీ తేర్నెకల్లు వెంకప్పను పొగడ్తలతో ముంచెత్తారు. వార్తలో లేవనెత్తిన ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వకపోవడం గమనార్హంగా మారింది. ప్రజల్లో, పార్టీ శ్రేణుల్లో ఉన్న అనుమానాలకు బదులుగా, విలేఖరిపై పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించడం విమర్శలకు దారి తీసింది.

కేసు నమోదు చేయని పోలీసులు: విలేఖరిపై కేసు నమోదు చేయాలంటూ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించిన జనసేన నాయకులకు పోలీసులు స్పష్టంగా నిరాకరించినట్లు సమాచారం. ప్రచురితమైన వార్తలో ఎక్కడా అసభ్య పదజాలం, వ్యక్తిగత దూషణలు, లేదా చట్ట విరుద్ధ అంశాలు లేవని ప్రాథమికంగా పోలీసులు భావించినట్లు తెలిసింది. ఇది రాజకీయ అభిప్రాయాలపై ఆధారపడ్డ వార్త మాత్రమేనని, క్రిమినల్ కేసుగా నమోదు చేసే అంశం లేదని పోలీసులు స్పష్టం చేసినట్లు వర్గాలు చెబుతున్నాయి.

మీడియా ప్రశ్నలతోనే బయటపడిన వాస్తవం : రాజకీయంగా ఖండన చేయాల్సిన అంశాన్ని పోలీస్ కేసుల దాకా తీసుకెళ్లడం సరైన పద్ధతి కాదన్న అభిప్రాయం మీడియా వర్గాల్లో వ్యక్తమవుతోంది. ప్రజాస్వామ్యంలో మీడియా అడిగే ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం రాజకీయ పార్టీల బాధ్యత అని పలువురు సీనియర్ జర్నలిస్టులు వ్యాఖ్యానిస్తున్నారు. ఆలూరు నియోజకవర్గంలో జనసేన పార్టీకి స్థానికంగా అందుబాటులో ఉండే పూర్తి స్థాయి నాయకత్వం ఉందా, స్థానిక సంస్థ ఎన్నికలపై పార్టీ వ్యూహం ఏమిటి, కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నా, ఆలూరులో జనసేన ఎందుకు కనిపించడం లేదు, అన్న ప్రశ్నలకు ఇప్పటికీ స్పష్టమైన సమాధానాలు రాకపోవడం రాజకీయంగా కీలకంగా మారింది.

కేఎల్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ 15వ స్నాతకోత్సవం

విశాలాంధ్ర - కర్నూలు : కేఎల్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ తన 15వ స్నాతకోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించింది. 2025 విద్యా సంవత్సరానికి చెందిన 5 వేల మందికి పైగా విద్యార్థుల అకాడమిక్ ప్రయాణంలో ఇది ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. విశ్వవిద్యాలయ వడ్డేశ్వరం క్యాంపస్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమం, సంస్థలోని ఉన్నత విద్యా వ్యవస్థ యొక్క విస్తృతి, వైవిధ్యం, అకాడమిక్ లోతును ప్రతిబింబించింది. స్నాతకోత్సవం భావోద్వేగాలు, ఉత్సాహం, గర్వంతో నిండిన వాతావరణంలో సాగింది. సంవత్సరాల పాటు చేసిన కృషి, సాధించిన విజయాలను జరుపుకునేందుకు స్నాతకులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపకులు ఒకచోట చేరారు. ఈ కార్యక్రమానికి భారత జాతీయ విజ్ఞాన అకాడమీ అధ్యక్షుడు ప్రొఫెసర్ వినోద్ కె. సింగ్ ముఖ్య అతిథిగా హాజరై స్నాతకోత్సవ ప్రసంగం చేశారు. టాటా మెమోరియల్ సెంటర్, గ్రామీణ అవుట్‌రీచ్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీపాద్ బనవల్లి గౌరవ అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భేగా 184 మంది డాక్టరల్ స్కాలర్స్‌కు, 700 మందికి పైగా పీజీ విద్యార్థులకు, 4,500 మందికి పైగా అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, సైన్సెస్, లా, ఫార్మసీ, అగ్రికల్చర్, ఆర్కిటెక్చర్, హ్యూమానిటీస్ వంటి విభిన్న విభాగాలకు చెందిన విద్యార్థులు ఈ పట్టాలు పొందారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 30, డిసెంబరు 2025

యూరియా అందుబాటులో ఉంది.. ఆందోళన వద్దు

విశాలాంధ్ర -గోనెగండ్ల: ఎమ్మిగనూరు నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో రైతులకు అందుబాటులో యూరియా ఉంది. ఏడీఏ ఎస్ మహమ్మద్ ఖాద్రీ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రబీ సీజన్లో గోనెగండ్ల, ఎమ్మిగనూరు, నందవరం, మండలాల్లో మొక్కజొన్న పంట అధికంగా సాగు చేశారు. ఈ పంటలకు కావలసిన యూరియాను రైతు సేవ కేంద్రాల ద్వారా, ప్రాథమిక వ్యవసాయ సంఘాల ద్వారా రైతులకు అందజేయడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు గోనెగండ్ల మండలంలో 864 టన్నుల యూరియా, ఎమ్మిగనూరు మండలంలో 455 టన్నుల యూరియా, నందవరం మండలంలో 178 టన్నుల యూరియా, మంత్రాలయం మండలంలో 112 టన్నుల యూరియా రైతులకు సరఫరా చేయడం జరిగింది. రైతులకు కావలసిన యూరియా ఎప్పటికప్పుడు రైతు సేవా కేంద్రాల ద్వారా ఇండెంట్ పెట్టించి రైతులకు సరఫరా చేయడం జరుగుతుంది. రైతులు ఎవరు యూరియా కోసం ఆందోళన చెందవలసిన అవసరం లేదని తెలిపారు. ప్రతి ఎరువుల దుకాణం ముందు యూరియా లభ్యత గురించి తెలిపే ఫ్లెక్సీ పెట్టడం జరిగిందని తెలిపారు. కాంప్లెక్స్ ఎరువులు ఎమ్మిగనూరులో 1856 టన్నులు, గోనెగండ్లలో 411 టన్నులు, నందవరంలో 212 టన్నులు, మంత్రాలయంలో 242 టన్నులు అందుబాటులో ఉన్నాయని ఏడీఏ ఎస్ మహమ్మద్ ఖాద్రీ తెలిపారు.

నిధులు విడుదల చేయకుంటే ఉద్యమమే



విశాలాంధ్ర - కొలిమిగుండ్ల: కూటమి ప్రభుత్వము స్థానిక సంస్థలకు నిధులను విడుదల చేయకుండా కాలయాపన చేస్తూ కుట్ర చేస్తున్నదని వైఎస్ఆర్సిపి పంచాయతీరాజ్ విభాగము రాష్ట్ర అధ్యక్షులు వి రవీంద్రారెడ్డి విమర్శించారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సకాలంలో నిధులను విడుదల చేస్తున్న కూటమి ప్రభుత్వం మాత్రం అడ్డంకులను సృష్టిస్తున్నదని ధ్వజమెత్తారు. సోమవారం మండలంలోని ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన బెలుం గుహల పర్యటనకు విచ్చేసిన కేంద్ర పంచాయతీరాజ్ శాఖ జాయింట్ సెక్రెటరీ రాజేష్ కుమార్ సింగ్‌కు స్థానిక సంస్థలకు కూటమి ప్రభుత్వం త్వరితగతిన నిధులను విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా సర్పంచ్ల సంఘం అధ్యక్షులు లాయర్ మహేశ్వర్ రెడ్డి, తదితర సర్పంచ్లతో కలిసి ఆయన వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సర్పంచ్లు, ఎంపీటీసీ, జడ్పిటిసిల హక్కులను కాలరాస్తున్నదన్నారు. స్థానిక సంస్థలకు సంబంధించి 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన కూటమి ప్రభుత్వం మాత్రం నిలిపి వేసిందని, కేవలం గ్రీన్ అంబా సిడర్ల జీతాలు, వీధిలైట్లకు మాత్రమే నిధులను వినియోగించుకోవాలని మిగిలిన వేటికి గ్రామపంచాయతీల నిధులను వాడకూడదని నిషేధించడం ఎంతవరకు సబబు అన్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల పదవీకాలం ముగిసే వరకు కాలయాపన చేస్తే ఆ తర్వాత నిధులను దోచుకోవచ్చని కుట్రను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం పన్నుతున్నదన్నారు. ప్రశ్నిస్తానంటూ వచ్చిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తన పంచాయతీరాజ్ శాఖను నిర్వీర్యం చేస్తుంటే ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. పాత నిబంధన ప్రకారం గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం వెంటనే నిధులను విడుదల చేయాలని లేదంటే వైఎస్ఆర్సిపి ఆధ్వర్యంలో ఉద్యమం తప్పదని హెచ్చరించారు. అలాగే స్థానిక సంస్థలకు న్యాయం జరిగేలా నిధుల విడుదలపై హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో వైసీపీ జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షులు రామ లక్ష్మణ్, సర్పంచులు నందిపాడు గురువిరెడ్డి, మహేశ్వర్ రెడ్డి, మండల యువజన అధ్యక్షులు సోమశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన గుడిసె ఆదికృష్ణమ్మ

విశాలాంధ్ర - ఆదోని రూరల్: రాష్ట్ర టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం సీఎం క్యాంప్ కార్యాల యంలో ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడుని గౌరవ ప్రదంగా కలిసి పుర బోకేను అంద జేశారు. జిల్లాలో జరుగుతున్న అభి వృద్ధి, నెలకొన్న సమస్యల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అడిగి తెలుసు కున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ జరుగుతున్న అభివృద్ధి, అనంతరం జిల్లాలో నెలకొన్న సమస్యలపట్ల వివరించారు. అనంతరం రాష్ట్ర జనవరుల శాఖ మంత్రి, కర్నూలు జిల్లా ఇంచార్జీ మినిస్టర్ నిమ్మల రామానాయుడును, రాష్ట్ర రహదారులు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని, రాష్ట్ర బీసీ వెల్ఫేర్ సవిత మ్మలను మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అమరావతి విద్యాసంస్థల అధినేత రామకృష్ణ పలువురు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ క్లీనిక్



విశాలాంధ్ర -ఆలూరు : భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి రెవెన్యూ క్లినిక్‌ను కార్యాలయంలో ఏర్పాటు చేసి ప్రత్యేక కౌంటర్ల ద్వారా రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నట్లు తహసీల్దార్ శోభ స్వర్ణమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భూ వివాదాలు, పట్టాదారు పాస్‌బుక్స్, ఆధార్ లింకేజీ, రికార్డుల సవరణ తదితర సమస్యలు ఎదుర్కొంటున్న రైతులు అందరూ రెవెన్యూ క్లినిక్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు తమ సమస్యలను నేరుగా తెలియజేస్తే వాటిని పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె భరోసా ఇచ్చారు. భూ సమస్యలు ఉన్న రైతులు తప్పకుండా కార్యాలయానికి వచ్చి తమ అర్జీలు సమర్పించాలని తహసీల్దార్ కోరారు. డిప్యూటీ తాహసిల్దార్ విజయ కుమార్, ఆర్ఐ బసవన్న గౌడ్, వీఆర్వోలు రవికుమార్, విజయకుమార్, అక్కమ్మ, అమ్రేష్ రెడ్డి, రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆదోని జిల్లా సాధన సమితి రిలే నిరాహార దీక్షలు

విశాలాంధ్ర - ఆలూరు: ఆదోని జిల్లా ఏర్పాటు కోసం కొనసాగుతున్న ఆదోని జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలోని రిలే నిరాహార దీక్షలు 18వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పెద్ద హెుత్తూరు గ్రామస్తులు సోమవారం దీక్షకు మద్దతు తెలుపుతూ దీక్ష శిబిరంలో కూర్చున్నారు. ఈ సందర్భంగా పెద్ద హెూతురు గ్రామస్తులు మాట్లాడుతూ, ఆదోని జిల్లా ఏర్పడితే కేవలం తమ గ్రామానికే కాకుండా మొత్తం నియోజకవర్గానికి పరిపాలనా సౌలభ్యం పెరుగుతుందన్నారు. జిల్లా ఏర్పాటుతో ప్రభుత్వ కార్యాలయాలు సమీపంలోకి వచ్చి, అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతాయని వారు అభిప్రాయపడ్డారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ విషయాన్ని గమనించి ఆదోని జిల్లా ఏర్పాటు అంశాన్ని తక్షణమే పరిష్కరించాలని పెద్ద హెూతురు గ్రామస్తులు డిమాండ్ చేశారు.

అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవు

విశాలాంధ్ర - పత్తికొండ: ఎరువులను అధిక ధరలకు అమ్మినట్లయితే చర్యలు తప్పవని వ్యవసాయ సహాయ సంచాలకులు మోహన విజయ్ కుమార్ హెచ్చరించారు. సోమవారం యూరియా నిలువలు ఉన్న డీలర్ల షాపులను వ్యవసాయ అధికారులు తనిఖీ చేపట్టి స్టాక్ నిలువలు, ఆన్‌లైన్ అమ్మకాలు పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎరువులను అమ్మినప్పుడు తగిన రసీదు ఇచ్చి ఆన్‌లైన్ నమోదు చేయాలన్నారు. యూరియాతో పాటు వేరే ఎరువులను లింకు ద్వారా ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయాలు జరిపినట్లయితే అలాంటి డీలర్లపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వెంకటరాముడు పాల్గొన్నారు.

వసతి గృహ విద్యార్థులకు ముస్తాబు కిట్లు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని జిల్లాలోని 155 వసతి గృహాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ముస్తాబు కిట్లు అందజేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ భవనంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన అనంతరం శాఖాధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు కలెక్టర్, జాయింట్ కలెక్టర్లను కలిసేందుకు వచ్చే జిల్లా అధికారులు ఎవరూ బొకేలు, కేకులు, శాలువలు తీసుకురావద్దని స్పష్టంగా ఆదేశించారు. వాటికి ప్రత్యామ్నాయంగా విద్యార్థుల పరిశుభ్రతను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పాఠశాలలో 'ముస్తాబు కార్నర్' ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నూతన సంవత్సర శుభాకాంక్షల సందర్భంగా జిల్లా సర్వోన్నత అధికారికి అందించే కానుకల స్థానంలో ముస్తాబు కిట్లు అందజేసే విధంగా జిల్లా అధికారులు సహకరించాలని కోరారు. ఈ కిట్లలో అద్దం, దువ్వెన, నెయిల్ కట్టర్, హ్యాండ్‌వాష్, శానిటైజర్ వంటి అవసరమైన వస్తువులు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ విధంగా సేకరించిన ముస్తాబు కిట్లను జిల్లాలోని వసతి గృహాల్లోని విద్యార్థులకు పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా, 20 మందికి పైగా కార్మికులు విధులు నిర్వహిస్తున్న ప్రైవేటు కర్మాగారాలు, పాఠశాలలు, ఆసుపత్రులు తదితర సంస్థలు తప్పనిసరిగా ఈపిఎఫ్ఓలో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. సంబంధిత ఉద్యోగులు ప్రధానమంత్రి విక్షిత్ భారత్ రోజ్‌గార్ యోజన కింద నమోదు చేసుకోవడం ద్వారా ఉద్యోగ సంస్థలకు, ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి ఇన్సెంటివ్ రూపంలో ప్రోత్సాహకాలు అందజేస్తున్నట్లు అన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా జి.వెంకటరామిరెడ్డి

విశాలాంధ్ర - నందికొట్కూరు : పట్టణ నూతన మున్సిపల్ కమిషనర్‌గా జి.వెంకటరామి రెడ్డి సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యాలయ సిబ్బంది ఘనస్వాగతం పలికారు. నూతన మున్సిపల్ కమిషనర్ వెంకటరామి రెడ్డిని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి సాదరంగా ఆహ్వానించి పూలబొకే అందజేసారు. అదేవిధంగా పట్టణ వార్డు కౌన్సిలర్లు పి.చాంద్ భాష, అబ్దుల్ రవూఫ్, లాలు ప్రసాద్, ఉస్మాన్ బేగ్, సఫ్లయర్ సత్యనారాయణ, వి.ఆర్ శ్రీను, కురువ శ్రీను, కమిషనర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి పాలకమండలితో సమన్వయం చేసుకుంటూ మున్సివల్ యంత్రాంగం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. మున్సిపల్ సిబ్బంది, ఇతర ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రూ.33 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : పేద ప్రజలు ఆపదలో ఉంటే నేనున్నానని ఆదుకోవడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంచి మనసుకు నిదర్శనమని నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ అన్నారు. మంత్రి ఫరూక్ క్యాంపు కార్యాలయం నందు రూ.33,51,863 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్న పేదవారికి వెంటనే ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు చేయడం జరిగిందని, నంద్యాల ప్రజల తరుపున సీఎం చంద్రబాబుకు ఫిరోజ్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మునియర్ ఖలీల్, కౌన్సిలర్ కండే శ్యాంసుందర్ లాల్, బింగుమల్లె శ్యామ్ సుందర్ గుప్తా, కామిని మల్లికార్జున, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : నంద్యాల జిల్లా మార్కెట్ కమిటీ ఉద్యోగుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను కడప రీజినల్ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు సోమవారం ఆవిష్కరించారు. కడపలోని కార్యాలయంలో ఆవిష్కరించారు. డీడీఎం లావణ్య, మార్కెట్ కమిటీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోరంట్ల శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి సురేష్, ఉపాధ్యక్షుడు రాజశేఖర్ తదితరులు పాల్గొని అసోసియేషన్ సభ్యులందకి ముందస్తు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర - అవుకు : పట్టణంలోని కోటా వీధిలో వెలసిన అతి పురాతనమైన శ్రీ భూలక్ష్మి చెన్నకేశవ స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు శ్రీ చెన్నకేశవ స్వామి భజన బృందం సభ్యులు తెలిపారు. వారు మాట్లాడుతూ ఆలయంలో వేకువ జాము నుండి భక్తులకు స్వామివారి ఉత్తర ద్వార దర్శనాన్ని కల్పించనున్నట్లు తెలిపారు. ఉత్తర ద్వారా దర్శనముతో కోటి యజ్ఞల ఫలం లభిస్తుందని అన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలన్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి సంతాపం

విశాలాంధ్ర - చాగలమర్రి : చాగలమర్రి పట్టణంలోని కొత్త ఎస్సీ కాలనీకి చెందిన టిడిపి కార్యకర్త, భూమా కుటుంబ అభిమాని మేడిదిన్నె పాపన్న (55) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు, నంద్యాల పార మెంటరీ బిసి సెల్ స్పోక్‌పర్సన్ సల్లా నాగరాజు యాదవ్ కాలనీకి చేరుకుని మృతి చెందిన పామన్న మృతదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించి మృతుడి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. సంతాపం తెలిపిన వారిలో నాయకులు టిఎన్‌టియూసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నర్సింహుడు, నియోజకవర్గం సిసిఎల్ ఉపాధ్యక్షుడు కపినేని ఓబులేసు, దూదేకుల సంఘం మండల అధ్యక్షులు టైలర్ భాష, వెంకటయ్య, పీరయ్య, మోహన్ ఉన్నారు.

అహోబిలంలో ముక్కోటి ఏకాదశి ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ప్రముఖ పుణ్య క్షేత్రమైన అహోబిలం లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లు పూర్తయ్యాయని మఠం ప్రతినిధులు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ మంగళవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తుల కోసం ఉత్తర ద్వార దర్శనాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఉత్తర ద్వారం వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి, మండపాలను నిర్మించి ప్రత్యేక అలంకరణలు చేశారు. వైకుంఠ ద్వార దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు మఠం ప్రతినిధులు తెలిపారు. భక్తులు క్రమశిక్షణ పాటిస్తూ దర్శనం చేసుకోవాలని వారు కోరారు.

శ్రీ రాఘవేంద్ర స్వామి సన్నిధిలో ఏపీఎస్ఆర్టీసీ ఎండీ



విశాలాంధ్ర - మంత్రాలయం: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనార్థమై ఏపీఎస్ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు సోమవారం మంత్రాలయం చేరుకున్నారు. వీరికి శ్రీ మఠం అధికారులు పోలీసు అధికారులు స్వాగతం పలికారు. వీరు మొదటగా గ్రామ దేవత మాంచాలమ్మను దర్శించుకుని తదనంతరం శ్రీ రాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్ని దర్శించుకున్నారు వీరికి శ్రీ మఠం ప్రస్తుత పీఠాధిపతి సుభుదేంద్ర తీర్థులు శేష వస్త్ర ఫలా పుష్ప, మంత్రాక్షలు ఇచ్చి ఆశీర్వదించారు. వీరి వెంట అప్పలరాజు, మఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు, ఐపీ నరసింహ, సీఐ పి.రామానుజులు ఉన్నారు.

రెవెన్యూ క్లినిక్స్‌తో ప్రజలకు వేగవంతమైన న్యాయం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : జిల్లాలో రెవెన్యూ సంబంధిత సమస్యలకు వేగవంతమైన పరిష్కారం అందించాలనే లక్ష్యంతో రెవెన్యూ యంత్రాంగం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆవరణంలో ఏర్పాటు చేసిన ఏడు రెవెన్యూ క్లినిక్స్ ద్వారా ప్రజల నుండి మొత్తం 373 దరఖాస్తులను స్వీకరించామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణంలో నిర్వహించిన రెవెన్యూ క్లినిక్స్‌కు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు భారీ సంఖ్యలో హాజరై తమ రెవెన్యూ సంబంధిత సమస్యలపై అర్జీలు సమర్పించారు. జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్, డిఆర్ఓ రాము నాయక్, రెవిన్యూ డివిజనల్ అధికారులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, అన్ని మండలాల తాసిల్దారులు రెవిన్యూ క్లినిక్స్ లో ఉత్సాహంగా పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి దరఖాస్తును సంబంధిత రెవెన్యూ డెస్కులలో నమోదు చేసి, త్వరితగతిన పరిష్కరించేలా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. రెవెన్యూ శాఖ అందిస్తున్న సేవల పట్ల ప్రజల్లో ఉన్న నమ్మకం మరింత పెంచి, సంతృప్తి స్థాయిని మెరుగుపరచడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ వినూత్న కార్యక్రమాన్ని అమలులోకి తీసుకువచ్చిందన్నారు. రెవెన్యూ క్లినిక్స్ ద్వారా ప్రజలకు నేరుగా సేవలు అందించడం వల్ల సమస్యల పరిష్కారం మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా జరుగుతోందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఏడు రెవెన్యూ క్లినిక్స్ ద్వారా స్వీకరించిన 373 దరఖాస్తులు అందాయన్నారు.

మెడికవర్ హాస్పిటల్స్ క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - బళ్లారి చౌరస్తా: మెడికవర్ హాస్పిటల్స్ నూతన క్యాలెండర్లను యెమ్మిగనూరు సర్కిల్ డీఎస్పీ ఎన్.భార్గవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కలిగించే విధంగా రూపొందించిన ఈ క్యాలెండర్లు సమాజానికి ఉపయోగపడతాయని తెలిపారు. మెడికవర్ హాస్పిటల్స్ కర్నూలు క్లస్టర్ హెడ్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని కేంద్రంగా చేసుకుని మెడికవర్ హాస్పిటల్స్ ఎన్నో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు.

హైస్కూల్‌లో డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర - కోడుమూరు: మండలంలోని కల్లపరి గ్రామంలో ఉన్న ప్రభుత్వ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఈగల్ సెల్ - కర్నూలు ఆధ్వర్యంలో బుధవారం డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఈగల్ సెల్ సబ్ ఇన్స్పెక్టర్ సుజన్ కుమార్ హాజరై విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే ప్రమాదాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. డ్రగ్స్ వినియోగం వల్ల శారీరక, మానసిక నష్టాలతో పాటు సమాజంపై పడే దుష్పరిణామాలను ఆయన వివరించారు. నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ యాక్ట్ గురించి విద్యార్థులకు స్పష్టమైన సమాచారం ఇచ్చారు. డ్రగ్స్ విక్రయించడం, వినియోగించడం, నిల్వ చేయడం చట్టపరంగా తీవ్రమైన నేరమని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపించిన వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1972కు సమాచార మివ్వాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సే నో టు డ్రగ్స్ అంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమాన్ని హైస్కూల్ హెచ్ఎం శాంతమూర్తి, ఉపాధ్యాయులు ప్రశంసించారు. ఈగల్ సెల్ సందేశంగా డ్రగ్స్ వద్దు బ్రో, భవిష్యత్ చూసుకో బ్రో అంటూ యువత డ్రగ్స్‌కు పూర్తిగా దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈగల్ సెల్ సిబ్బంది, కోడుమూరు పోలీస్ సిబ్బంది నాగన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తులకు మంచినీటి సదుపాయం

విశాలాంధ్ర-గూడూరు: మండలంలోని పొన్నకల్ గ్రామంలో అయ్యకొండ మిన్నెల స్వామి ఉర్సు సందర్భంగా భక్తుల దాహార్తి తీర్చేందుకు చైతన్య యూత్ సభ్యులు మంచినీటి సదుపాయం కల్పించారు. సోమవారం చైతన్య యూత్ ప్రెసిడెంట్ ఎల్.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేసి భక్తులకు మంచి నీటిని పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ఉరుసు సందర్భంగా ప్రతి ఏటా చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నామని, 29 ఏళ్లుగా యూత్ ఆధ్వర్యంలో భక్తుల దాహార్తి తీరుస్తున్నట్లు వారి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు పట్టణ కౌన్సిలర్ బజారి, విజయుడు, రామాంజి, చైతన్య యూత్ సభ్యులు పి.కృష్ణ మనోహర్, ఆచారి, మేకల గిడ్డయ్య, ఈశ్వర్, రామగిరి, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

జైలు జీవితం అనంతరం సత్ప్రవర్తనతో మెలగాలి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : పట్టణంలోని సబ్ జైలును జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి లీల వెంకట శేషాద్రి, జూనియర్ సివిల్ జడ్జి భాస్కర్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిమాండ్ ఖైదీలతో జైలులో ఎన్ని రోజులుగా శిక్ష అనుభవిస్తున్నారు, న్యాయవాదులను ఏర్పాటు చేసుకున్నారా లేదా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. జైలులో అందిస్తున్న సేవలు, సౌకర్యాలు, భోజన వసతి, వైద్య సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదిని నియమించుకోలేని వారికి ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామన్నారు. జైలు జీవితం అనంతరం సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ జైలు ఇంచార్జ్ సూపరింటెండెంట్ బాబు, ప్యానల్ న్యాయవాది మోహన్, డాక్టర్ లిఖిత్ రెడ్డి, జైలు సిబ్బంది, కోర్టు పాల్గొన్నారు.

యాగంటిలో హుండీ లెక్కింపు

విశాలాంధ్ర - బనగానపల్లె రూరల్ : యాగంటిలో వెలసిన శైవ క్షేత్రం శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానం నందు సోమవారం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని అధికారులు చేపట్టారు. ఇందులో 80 రోజులకు గాను 29 లక్షల 58వేల 535 రూపాయల నగదు, 35 గ్రాముల బంగారం, 160 గ్రాముల వెండి వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పాండు రంగారెడ్డి తెలిపారు. యాగంటి దేవస్థానానికి మొదటిసారిగా బంగారం వచ్చినట్లు ఈవో వెల్లడించారు. ఈ కార్యక్రమంలో యాగంటి పల్లె బండి మౌళీశ్వర రెడ్డి, ఎం.భరతుడు, పి.శ్రీరాములు, రామశేఖర్ అర్చకులు, ఆలయ సిబ్బంది, శ్రీ రామ సేవా సమితి సేవకులు, పోలీసు అధికారులు, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.